క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డిచే సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి


తల్లీబిడ్డలను పరీక్షిస్తున్న సీడీపీవో సునీత

చక్రాయపేట : ప్రతి రోజు పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఇవ్వాలని వేంపల్లె ప్రాజక్టు ఐసీడీఎస్ సీడీపీవో సునీత తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని సిద్దారెడ్డిపల్లె, గడ్డంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన పోషకాహార మాసోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిషోర్ బాలికల్లో రక్త హీనత నివారించుటకు సమతుల్య పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగసుభాషిణి, సుభద్ర, మహిళా పోలీసు మందాకిని, ఏఎన్‌ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

ఘన సన్మానం


రసూల్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

పులివెందుల టౌన్ : స్థానిక నూరుబాషా సంఘం కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర నూరుబాషా అధ్యక్షుడిగా ఎన్నికైన ఓతూరు రసూల్‌ను శుక్రవారం మైనార్టీ నాయకులు నూరుల్లా ఆధ్వర్యంలో సత్కరించారు. ఇలాంటి పదవులు ఆయన మరెన్నో పొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ మసీదు ముత్తవల్లి హమీద్, నూరుబాషా ప్రెసిడెంట్ ఫకృద్దీన్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో శుక్రవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి చీరలను పంపిణీ చేశారు. ఇప్పట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మార్తల పుల్లారెడ్డి 2వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు కడప జిల్లా వైసీపీ యూత్ వింగ్ సెక్రటరీ మార్తల అశోక్‌రెడ్డి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, ట్రస్ట్ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

లింగాల : మండలంలోని వినాయక మంటపాలలో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని సీఐ రమణ తెలిపారు. శుక్రవారం లింగాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో కమిటీ సభ్యులకు ఆయన తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఊరేగింపులు, మంటపాల ఏర్పాట్లలో విద్యుత్ లైన్లు చూసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కక్షలు, కార్పణ్యాలను వీడాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఫయాజున్నీసా

చక్రాయపేట : ప్రతి వ్యక్తి కక్షలు కార్పణ్యాలను వదిలి ప్రశాంతంగా జీవించడం అలవాటు చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఫయాజున్నీసా తెలిపారు. శుక్రవారం మండలంలోని కె.రాజుపల్లెలో నిర్వహించిన లీగల్ లిటరసీ క్యాంపులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడు నిత్యం చట్టాలకు లోబడి జీవించాల్సి ఉంటుదన్నారు. పేదలకు, వికలాంగులకు, మతి స్థిమితంలేని వారికి ఉచిత న్యాయ సహాయం చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రజలు తమ సమస్యలను గ్రామంలోనే ప్రశాంతంగా పరిష్కరించుకుంటే మంచిదన్నారు. కక్షలు పెంచుకుంటే అవి మన జీవితాలనే కాదు కుటుంబ సభ్యులందరినీ నాశనం చేస్తాయన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె బార్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రిటైనర్ న్యాయవాది చెన్నకృష్ణయ్య, ఏజీపీ బాలాజిరెడ్డి, ఏఎస్ఐ శేషయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వినాయక చవితి పండుగ సందడి


కమలాపురం మార్కెట్‌లో విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు


పులివెందులలో గణపతి పూజలకు కావాల్సిన పండ్లు, పూలను కొంటున్న ప్రజలు

కమలాపురం : మండలంలో ఎటు చూసిన వినాయక చవితి సందడి నెలకొంది. పట్టణంతో పాటు పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, రాజుపాళెం, నల్లింయగాయపల్లె, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, కోగటం, సంబటూరు, గంగవరం, విభరాపురం, దేవరాజుపల్లె తదితర గ్రామాలలో వినాయక చవితి సంబరాలు చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

పట్టణంలో ప్రతి వీధిలో బొజ్జ గణపతయ్యలను ప్రతిష్టించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. షామియానాలు వేసి, రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన వేదికలపై వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే చాలా మంది కడప, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాలలకు వెళ్ళి భారీ నుంచి అతి భారీ విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకొచ్చారు. శనివారం ఉదయం ప్రతిమలను ప్రతిష్టించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రతి ఇంట్లో బుల్లి గణేష్‌లను ప్రతిష్టించేందుకు మహిళలు మార్కెట్‌కు వచ్చి ప్రతిమలతో పాటు చెరుకు గడెలు, ఎలక్కాయలు, గడ్డి, అరటి పిలకలు, మొక్కజొన్న కంకులు, మామిడి ఆకులు తీసుకెళ్లారు. దీంతో కమలాపురం మార్కెట్‌లో వినాయక చవితి సందడి నెలకొంది.

పులివెందుల టౌన్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పులివెందులలో గణనాథులు కొలువు తీరారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్‌లో పండుగ శోభ సంతరించుకుంది. ప్రజలు బొజ్జ గణపయ్యలను కొనుగోలు చేశారు. అలాగే పండ్లు, చెరుకు గడలు, పూలు కొనుగోలు చేస్తుండటంతో సందడి వాతావరణం కనిపించింది. కొనుగోలు చేసిన గణనాథులను పల్లెలకు తరలించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. పట్టణంలో వాడవాడలా గణనాథులను కొలువు తీర్చేందుకు మండపాలు ఏర్పాటు చేసి అందంగా ముస్తాబు చేశారు.

పులివెందుల రూరల్ : మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని వ్యవసాయ అధికారి నాగలక్ష్మి తెలిపారు. వినాయక చవితి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని భారత్ ఆగ్రో ఏజెన్సీలో మట్టి గణపతులను ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు. నిమజ్జనం రోజు మట్టి వినాకమయ్యలను పొలాల్లోనే ఒక బకెట్‌లో నీళ్లు తీసుకుని అందులో నిమజ్జనం చేసి ఆ నీటిని పొలంలోని అరటి మొక్కలకు చల్లుకోవాలన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ వేషధారణలతో నృత్య ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు. అనంతరం పండగ విశిష్టతపై విద్యార్థులకు వివరించారు. అలాగే గణపతి విగ్రహ తయారీ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.చైతన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలను పట్టించడంలో అధికారులు కక్కుర్తి

వేంపల్లె : స్థానిక పంచాయతీ పరిధిలో వీధి కుక్కలను పట్టించడంలో అధికారుల కక్కుర్తి స్పష్టమవుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతిప్రాంతంలో ఎక్కడ చూసినా కుక్కల బెడద ఉందన్నారు. అయితే పంచాయతీ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో కూడా వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులు మాత్రం 100 లోపు కుక్కలను పట్టించారని, అయితే 300 కుక్కలు పట్టించినట్లు బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలు చేశారు. రోజురోజుకు కుక్కల దాడిలో చాలా మంది గాయాల పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వరద బాధితులకు సాయం

వేంపల్లె : విజయవాడ వరద బాధితుల కోసం సాయంగా రూ.55 వేల చెక్కును ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి శ్రీలక్ష్మి వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం రిటైర్డ్ ఈఓ ప్రతాప్ అందించారు. ఎమ్మెల్సీ రిటైర్డ్ ఈఓ వరద బాధితులకు సాయం అందించడం హర్షణీయమన్నారు. దేవస్థానం మాజీ చైర్మన్ జీవీ రమణ పాల్గొన్నారు.

దోమల నియంత్రణ.. మనందరి బాధ్యత


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిద్ధయ్య

వేముల : దోమల నియంత్రణ.. మనందరి బాధ్యతని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. శుక్రవారం వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేల్పులలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. దోమకాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గునియా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయని, కావున దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. అలాగే నీరు నిల్వ ఉంచిన తొట్లు, ఇతర పాత్రలు మూసి ఉంచాలని, ఇంట్లో ఉన్న నీటి కొళాయిల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలన్నారు. వారానికి ఒకసారి నీటి తొట్లను ఇతర పాత్రలను శుభ్రంగా కడిగి తుడిచి మరల నీటితో నింపుకోవాలన్నారు. దోమతెరను తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, నాగేశ్వరి ఎం.ఎల్.హెచ్.పి.వీణా కుమారి, ఆశా కార్యకర్త లక్ష్మిదేవిలు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై మంత్రికి ఫిర్యాదు

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరులో వెలసిన శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని శుక్రవారం వెల్లటూరు గ్రామానికి చెందిన ప్రజలు, భక్తులు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి పోస్టు ద్వారా వినతిపత్రం పంపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఆలయం చాలా పురాతనమైనది. ఆలయానికి మాన్యం భూములు ఉన్నాయి. ఆలయానికి సంబంధించి సర్వేనంబర్ 192,193,174లో భూమి ఉందన్నారు. ఆభూమిని అక్రమార్కుల నుంచి కాపాడాలని కోరారు.

పర్యాటకుల ఆధార్ నమోదు తప్పనిసరి


లాడ్జి నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

పెద్దముడియం : గండికోటకు వచ్చే పర్యాటకుల ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయాలని అర్బన్ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. శుక్రవారం గండికోటలో టెంట్లు, రిసార్ట్, రూమ్స్ రెంట్స్‌కు ఇచ్చే నిర్వాహకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ సి.సి కెమెరాలు, రూమ్స్‌కు వచ్చి పోయే వారి వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేసి ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు ఏదో ఒకటి తీసుకోవాలని తెలిపారు. అలాగే సెక్యూరిటీ గార్డును పెట్టుకోవాలన్నారు. ఎవరైనా ఈ సూచనలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామకృష్ణ, టి.కల్పన పాల్గొన్నారు.

చవితి వేడుకలకు సర్వం సిద్ధం


ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

తొండూరు : వినాయక చవితి సందర్భంగా మండల వ్యాప్తంగా ఉత్సవాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మండపాలను ఏర్పాటు చేశారు. పట్టణ చుట్టు పక్కల గ్రామాల ఉత్సవ నిర్వాహకులు వినాయకుడి విగ్రహాలను కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఎస్ఐ పెద్ద ఓబన్న ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. విగ్రహాల వద్ద ఊరేగింపు సందర్భంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉత్సవాలు నిర్వహించాలని కమిటీ సభ్యులను హెచ్చరించారు.

ఎర్రగుంట్ల : వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఎర్రగుంట్ల, కలమల్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 160 దరఖాస్తులు రాగా అన్నింటికి అనుమతులిచ్చినట్ల పోలీస్ అధికారులు తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసే మండపం వద్ద క్యూ ఆర్ కోడ్‌ను అతికించాలన్నారు. పోలీసుల తనిఖీల్లో భాగంగా ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే విగ్రహానికి సంబంధించిన అన్ని వివరాలు వస్తాయని పోలీసులు తెలిపారు.

కనీస వేతన జీఓ 11ను సవరించండి


కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేస్తున్న సుబ్బిరెడ్డి

ఎర్రగుంట్ల : ఆంధ్రప్రదేశ్‌లోని 66 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ పరిశ్రమలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని ఏపీ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్మిక సంఘం కార్యాలయంలో ఆయన శనివారం కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఐదేళ్లకొక్కసారి సవరించి కనీస వేతనాలను పెంచుతూ నూతన జీవోను విడుదల చేయాలన్నారు. అయితే కాలపరిమితి ఎనిమిదేళ్లు దాటినా ఇప్పటి వరకు జీవో సరవణ జరగక వేతనాలు పెరగక రాష్ట్రంలో వేలాది మంది కార్మికులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఐదు సిమెంట్ పరిశ్రమలు, ఆర్టీపీపీలో సుమారు పదివేల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాలను పెంచి కార్మికుల జీవితాల్లో వెలుగు నింపాలని ఆయన కోరారు.

కంటిచూపును పదిలంగా కాపాడుకోవాలి

పులివెందుల టౌన్ : కంటి చూపును పదిలంగా కాపాడుకోవాలని తొండూరు మండల వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉచిత కంటి పరీక్ష, కంటి ఆపరేషన్ల క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత నెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు నిర్వహించిన కంటి పరీక్షలు, ఆపరేషన్లు విజయవంతంగా ముగిసినందుకు వారిని ఆయన అభినందించారు. 740 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 148 మందికి కంటి ఆపరేషన్లు చేశారన్నారు. మేజర్ ఆపరేషన్‌కు 135 మందిని చెన్నైకి రెఫర్ చేసి ఉచిత కంటి ఆపరేషన్ చేయించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. న్‌ఆర్ఐ కంభం తిరుమలరెడ్డి, శంకర్ నేత్రాలయ చెన్నై సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, రవి, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ శోభన్‌బాబు

ఎర్రగుంట్ల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన హౌసింగ్ నిర్మాణ పనులలో వేగం పెంచాలని, అలాగే లబ్ధిదారులు వారి అవసరాలకు వాడుకున్న బిల్లుల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ శోభన్‌బాబు, కమిషనర్ రామకృష్ణయ్యలు తెలిపారు. శుక్రవారం కమిషనర్ కార్యాయలంలో హౌసింగ్ శాఖ, సచివాలయ సెక్రటరీలు, లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నిర్మాణ పనులకు వివిధ దశలలో ప్రభుత్వం బిల్లులను లబ్దిదారుల ఖాతాలో జమచేసిందన్నారు. అయితే ఆ బిల్లులను సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయినట్లు తెలిపారు. బిల్లులు ఇవ్వకుండా సాకులు చేబుతున్న లబ్ధిదారులకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నోటీసులు జారి చేస్తున్నట్లు వారు తెలిపారు. సమావేశానికి లక్షల్లో బకాయిలు ఉన్న లబ్ధిదారులు రాకపోవడం కొసమెరుపు. హౌసింగ్ ఏఈ కె.రామకృష్ణ, ఎస్ఐ విష్ణునారాయణ తది తరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ప్రజావేదిక


మాట్లాడుతున్న డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నం

ఎర్రగుంట్ల : మండలంలోని మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ ప్రజావేదిక శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సాదాసీదాగా జరిగింది. డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నం హాజరై సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ కూలీల వేతనాలు, మెటీరియల్‌కు రూ.7 కోట్లు ఖర్చు అయిందని దీనికి సబంధించిన గ్రామ సభల ద్వారా సమగ్రా సర్వే చేసి ప్రతిపాదించిన నివేదికలను అడిట్ సిబ్బంది చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, ఉపాధి ఏపీఓ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పనిచేయాలి


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

చెన్నూరు (వల్లూరు) : విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పని చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్ రమణ తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్‌లను, విద్యుత్ లైన్లను, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మండలంలోని విద్యుత్ శాఖ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టి ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ సంస్థ ద్వారా సర్వీస్ పొంది మీటర్ ద్వారా విద్యుత్‌ను వినియోగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాలిపోయిన స్తంభాలను, లూజుగా వున్న విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. తక్కువ ఎత్తులో వున్న లైన్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే పందిళ్ల వద్ద విద్యుత్ భద్రతా నియమాలను విధిగా పాటించేలా నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ రామలింగారెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై దాడులు

వేంపల్లె: స్థానిక వైఎస్సార్ మెమోరియల్ పార్కు వెనుక వైపు డంప్ చేసి ఉన్న ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా టిప్పర్, జేసీబీని వారు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు ఎస్సై తిరుపాల్‌నాయక్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దళారుల చేతుల్లో నష్టపోతున్న చీనీ రైతులు


చీనీ కాయలను పరిశీలిస్తున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల చీనీకాయల మార్కెట్‌లో రైతులు దోపిడీ దళారుల చేతిలో నష్టపోతున్నారని కమీషన్ 4 శాతం ఉంటే 8 శాతం వసూల్ చేస్తున్నారని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజారాంరెడ్డిలు తెలిపారు. శుక్రవారం పులివెందులలోని చీనీ మార్కెట్‌ను వారు పరిశీలించి మాట్లాడారు. రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు, జూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. అనేక ఇబ్బందులు పడి చీనీ పంటలు పండిస్తున్న రైతులను మార్కెట్‌యార్డులో వ్యాపారస్తులు, దళారులు నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం 4 శాతం కమీషన్ ఉంటే పులివెందుల మార్కెట్‌యార్డులో 8 శాతం కమీషన్ వసూల్ చేస్తున్నారన్నారు. దీనివల్ల చీనీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే మార్కెటింగ్‌శాఖ అధికారులు బయట ఉన్న వ్యాపారస్తులను లోపలికి వచ్చే విధంగా ప్రోత్సహించాలని వారు కోరారు. ధరలు తక్కువగా ఉన్నప్పుడు చీనీ రైతులను అన్ని విధాల ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం శీతల గిడ్డంగులు, జ్యూస్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం మార్కెటింగ్‌శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు.

పురుగు నివారణతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు

వల్లూరు : పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణతో అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం వుంటుందని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శిల్పకళ తెలిపారు. మండల పరిధిలోని పైడికాలువ గ్రామంలో రైతులు సాగుచేసిన పత్తి పంటను వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఈ పురుగు ఆశించిన పంటకు ఒక లీటరు నీటికి 2 ఎంఎల్ ప్రొఫెనోఫాస్ లేదా థయోడికార్బ 1.5 గ్రాములు లేదా క్వినాల్ ఫాస్ 2.5 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. పంట చివరిదశలో వుంటే లీటరు నీటికి 1 ఎంఎల్ లామ్డా సైహాలోత్రిన్ కలిపి పిచికారి చేయాలన్నారు. కమలాపురం సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు ఆశించక మునుపే రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వేప నూనె కషాయం పిచికారి చేయడం, ఎకరాకు నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో శివశైలజ, ఏవో సాయిజ్యోతి, రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ శైలజ, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పత్తి పంటలో గులాబిరంగు పురుగును నివారించడానికి సమగ్ర సస్యరక్షణ పద్ధతి పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకల తెలిపారు. శుక్రవారం పెద్దనపాడు గ్రామంలో సాగుచేసిన పత్తి పంటను ఆమె పరిశీలించి మాట్లాడారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నియంత్రణకు ఫ్లోనికాడ్ 0.3 మి లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి మాట్లాడుతూ శనగ పంట సాగు చేసే రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ సహాయకులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ తల్లి సన్నిధిలో జిల్లా జడ్జి

కడప కల్చరల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి శుక్రవారం స్థానిక ఎర్రముక్కపల్లెలోని శ్రీ జగన్మాత మారెమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, న్యాయవాది సట్టి భారవి, పర్యవేక్షకులు ఎస్.భాస్కర్, పూజారిణీ మాధవిలు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె పూజలకు హాజరైన స్థానిక భక్తులకు గణపతి మట్టి విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ఏఓ మోహన్‌రావు, కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుర్రప్పనాయుడు, బాలాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దుకాణా దారులకు న్యాయం చేస్తాం


మాట్లాడుతున్నడిప్యూటీ డైరెక్టర్ సరస్వతమ్మ

వేంపల్లె : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ సంబంధించి దుకాణదారులకు న్యాయం చేస్తామని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతమ్మ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ సంబంధించి షాపింగ్ గదులను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. అయితే దుకాణదారులు తమ సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించుకుని మళ్లీ దుకాణాలను కొనసాగించారు. ఈ మరమ్మతులకు అయిన ఖర్చులను ఎస్సీ కార్పొరేషన్ నుంచి తమకు ఇప్పించాలని ఇటీవల కలెక్టర్ శివశంకర్‌కు విన్నవించుకున్నారు. దీంతో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శుక్రవారం షాపింగ్ గదులను పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాలు చాలా వరకు కోల్పోయాయని వాటిని మరమ్మతులు చేసుకునేందుకు దుకాణదారులకు ఖర్చు అయిందని తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి దుకాణా దారులకు న్యాయం చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో దుకాణా దారులు పాల్గొన్నారు.